చెత్త కుప్పలు.. ప్రజలకు తిప్పలు

- రోడ్లపై చెత్త పారబోత
- వెదజల్లుతున్న దుర్వాసన
- అవగాహన కల్పించాలని కోరుతున్న ప్రజలు



సాగర్ రోడ్డు సమీపంలో చెత్త కుప్పలు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. కొంత మంది చిరు వ్యాపారులు, మరి కొంత మంది స్థానికులు చెత్త సేకరణ చేసే ఆటోలు, ట్రాక్టర్లలో వేయకుండా రోడ్ల పైనే పడవేస్తున్నారు. పట్టణంలో ముత్తిరెడ్డికుంట, రాంనగర్, చైతన్య నగర్, ఈదులగూడెం, రాంనగర్ బంధం, హౌజింగ్‌బోర్డు, రెడ్డికాలనీ, విద్యానగర్, తడకమళ్ల రోడ్డు తాళ్లగడ్డ, షాబునగర్, శాంతినగర్, నందిపాడు బైపాస్, బంగారుగడ్డ, వినోభానగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్, నందిపాడు, హనుమాన్‌పేట తదితర ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ అక్కడ రోడ్లపైనే చెత్తపడవేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో తీసిన చెత్తను కూడా ఒకే దగ్గర నిల్వ చేయడంతో కాలనీ వాసులు దురువాసన వెదజల్లుతుందని వాపోతున్నారు.

ఇళ్ల మధ్య చెత్త డంపింగ్

పలు కాలనీలలో సరిగా చెత్తను తరలించకపోవడంతో కొంత ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపాలిటీలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షకాలం అరంభం అనగానే అంటు వ్యాధులు పంజా విసిరే అవకాశం ఉంది. అదే విధంగా అద్దంకి-నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డులో అనేక ప్రాంతాల్లో రోడ్ల వెంట మున్సిపల్ సిబ్బంది చెత్తను పడవేయడంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల మధ్యలోనే చెత్తను డంపింగ్ చేయడంతో పాటు గాలి వచ్చినప్పుడు దుర్వాసన వెదజల్లుతుంది. వివిధ ప్రాంతాల నుంచి తీసుకవచ్చిన చెత్త ఇండ్ల మధ్యలో పడవేయవద్దని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇళ్ల మధ్యలో చెత్త వేయడంతో ఇళ్లల్లో ఉండలేని దుస్థితి నెలకొంది.

దోమలు విపరీతంగా ఉన్నాయి



రోడ్ల వెంటనే చెత్త , చెదారం వేయడంతో గాలి వస్తే దురువాసన వస్తుంది. పక్క నుంచే ప్రధాన నాలా వెళ్తుండగా ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనం ఇస్తుంది. రోడ్లపై చెత్త వేయకుండా ప్రత్యేక చర్యలను తీసుకోవాలి. సాయంత్రం వేళల్లో డ్రైయినేజిలలో ఫాగింగ్ చేసి దోమలను నియంత్రించాలి.

– సుధాకర్ చౌదరి, హౌసింగ్‌బోర్డు

చెత్త వేస్తే జరిమానా విధిస్తాం



మున్సిపాలిటీలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రత్యేక చర్యలను తీసుకుంటాం. చెత్త వేసేవారిని గుర్తించి వారికి జరిమానా విధించే విధంగా చర్యలు చేపడతాం. చెత్తను కాలనీలోకి వచ్చే చెత్త వాహనాల్లో తడి,పొడి చెత్తను వేరు చేసి వేయాలి.ఈ విషయంను చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు కూడా ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. చెత్తను వాహనాల్లో వేసి పారిశుధ్య సిబ్బందికి సహకరించాలి.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

కరాటేలో చిన్నారుల ప్రతిభ


పతకాలు అందుకుంటున్న విహాస్ దుర్గ, సుదీక్ష

పెద్దవూర : మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన పాతనబోయిన విహాస్ దుర్గ, పాతనబోయిన సుదీక్షలు కరాటేలో బంగారు పతకాలు సాధించారు. తమిళనాడు రాష్ట్రం ఊటీలో నిర్వహించిన 15 బ్రేవ్ ఫైటర్స్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాతనబోయిన విహాస్ దుర్గ అండర్-9 విభాగంలో కటాస్, కుముతే విభాగాలలో రెండు బంగారు పతకాలను, పాతనబోయిన సుదీక్ష అండర్-10 విభాగంలో కటాస్, కుముతే విభాగాలలో రెండు బంగారు పతకాలను గెల్చుకున్నారు. వీరిద్దరు అక్కాతమ్ముళ్లు కావడం విశేషం. చిన్నతనంలోనే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు గెల్చుకోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గత ఫిబ్రవరి నెలలో విశాఖపట్నంలో నిర్వహించిన 8వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాతనబోయిన విహాస్ అండర్-9 విభాగంలో కటా, కుముతే విభాగాలలో రెండు బంగారు పతకాలను, సుదీక్ష అండర్-10 విభాగంలో కటా విభాగంలో కాంస్య పతకం , కుముతేలో వెండి పతకాలను గెల్చుకున్నారు.

పశువులను రైల్వే ట్రాక్‌పైకి రానివ్వొద్దు

మిర్యాలగూడ అర్బన్ : పశువులను రైల్వే ట్రాక్ పైకి రాకుండా చూసుకోవాలని రైల్వే ట్రాక్ సమీప గ్రామాల ప్రజలకు ఏఎస్ఐ బి. సుబ్బారావు అన్నారు. శనివారం రాత్రి కొండ్రపోల్ రైల్వే స్టేషన్ సమీప గ్రామాలలో పశువుల రన్ ఓవర్(సీఆర్ఓ) ప్రచారం నిర్వహించారు. పశువుల యజమానులు పశువులను కాని, మనుషులు కాని రైల్వే ట్రాక్ దాటవద్దని సూచించారు. ఈ విషంపై సమీప గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. పశువులు రైల్వే ట్రాక్ దాటే సమయంలో రైలు వస్తే పట్టాలు తప్పి రైల్వే ఆస్తికి నష్ట కలిగే అవకాశంతో పాటు ప్రయాణికుల భద్రతకు హాని కలిగిస్తుందని తెలిపారు. రైల్వే నిబంధనలు పాటించకుంటే సెక్షన్ 147(రైల్వే ప్రాంతలో అతిక్రమించడం), 154(రైల్వే ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించడం) ప్రకారం జరిమానాలతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట రైల్వే కానిస్టేబుల్ శ్రీ సాయికృష్ణ ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మాడుగులపల్లి : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇళ్ల పట్టాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. జర్నలిస్టులు నిర్భయంగా వార్తలు రాసి ప్రజలకు ప్రభుత్వానికి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమెల నాగయ్య, ఉపాధ్యక్షుడు భయ్యన్న, యాదగిరి, చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు షేక్ రసూల్, ప్రధాన కార్యదర్శి రాంబాబు, చిట్యాల సైదులు, నాగరాజు, రవి, అంజి, సైదులు, సురేందర్, శ్రవణ్, భరత్, శ్రీను, పీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, మాజీజడ్పీటీసీ సైదులు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో రైతు వాగ్వాదం

నిడమనూరు : మండలంలోని ముప్పారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో గొండ్లగూడెం గ్రామానికి చెందిన రైతు చర్క సర్వయ్య తన ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ కొనుగోలు రిజిస్టర్ చించి, వాగ్వాదానికి దిగాడని నిర్వాహకులు మల్లిక, అల్లంపల్లి పద్మ, పారిజాత తెలిపారు. ధాన్యం కొనుగోలు స్థలం తనదేనని, రూ.40 వేలతో కొనుగోలు కేంద్రం స్థలం చదును చేయించానని, తన ధాన్యం ఎందుకు కొనరంటూ రిజిస్టర్ చించాడని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఏపీఓ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సర్వయ్య ఇటీవలనే కొంత ధాన్య పోయగా, అవి కాంటా పూర్తి చేశామని...వాటి స్థానంలోనే ఈరోజు తెచ్చిన ధాన్యం కూడా కాంటా వేయలంటూ నిర్వాహకులపై ఒత్తిడి తీసువచ్చి వాగ్వవాదానికి దిగినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా ఇష్టానుసారంగా గొడవకు దిగాడని మహిళలు ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా సీరియల్ ప్రకారం చేస్తున్నామని ఆపరేటర్ మల్లిక తెలిపారు. తహసీల్దార్, పోలీసుల దృష్టికి తీసువెళ్లినట్లు తెలిపారు.

పారదర్శకంగా భూభారతి చట్టం అమలు


మాడుగులపల్లి : సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి


నిడమనూరు : సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాడుగులపల్లి : భూభారతి చట్టంలో అధికారాలను వికేంద్రీకరించడం వల్ల పారదర్శకతతో చట్టాన్ని అమలు చేసే అవకాశం ఉందని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తో కలిసి పాల్గొని మాట్లాడారు. ధరణిలోని సమస్యలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో అనేక మంది మేధావులతో చర్చించి సమావేశాలు ఏర్పాటు చేసి చిత్త శుద్ధితో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు మోకా మీద ఉండడంతోపాటు, సరైన ఆధారాలు ఉంటే భూములకు ఎలాంటి ధోకా లేదని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీకి గ్రామపాలనాధికారితోపాటు ప్రతి రెవెన్యూ విలేజ్‌కు లైసెన్స్‌డ్ సర్వేయర్లను ప్రభుత్వం నియమించనుందని తెలిపారు. మాడ్గులపల్లి మండలానికి త్వరలోనే కేజీబీవీ భవనం, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ నూతన సొంత భవనాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ సురేష్, ఎంఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ స్వామి, ఏఓ శివ రామ్‌కుమార్, ఏపీఎం బాషపాక చంద్రశేఖర్, పీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి

నిడమనూరు : భూ భారతి చట్టంపై రైతులకు అవగాహ అవగాహన కల్పించాలని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిషత్ ప్రాంగణంలో భూ భారతి చట్టం-2025 పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ధరణి చట్టం తీసుకొచ్చింది కానీ నిబంధనలు విస్మరించిందని ఆరోపించారు. భూ భారతి చట్టంతో పాటు, రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంపై ప్రతి గ్రామంలో రైతు సదస్సు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టం-2025తో రైతులు సరిహద్దు సమస్యలు లేకుండా సమగ్రంగా లైసెన్సడ్ సర్వేయర్లతో సర్వే చేయించి హద్దులు నిర్ణయించి భూ రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు. 80శాతం వరకు భూ సమస్యలు తాహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. సదస్సు కంటే ముందు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ట్రాక్టర్‌పై రైతులతో కలిసి వచ్చారు. రైతుల నుంచి పెద్ద సంఖ్యలో వినతిపత్రాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో భూ పారిపాలన అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీఓ బోనగిరి రమేష్, అధికారులు ఆర్ఐ రాజిరెడ్డి, సందీప్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, నాయకులు వెంకట్రాహుల్, చినవీరయ్య, వెంకట్ బాబు, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గోవింద్ రెడ్డి, శివ మారయ్య, శ్రీను, మధు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోల్యనాయక్‌తండాలో అధ్వానంగా డ్రెయినేజీ

చందంపేట : మండలంలోని పోల్యనాయక్‌తండాలో మురుగు నీటి పారుదల అస్తవ్యస్తంగా తయారైంది. సుమారు నెల రోజులుగా మురుగు కాలువలను పూడిక తీయకపోవడంతో మట్టికురుకుపోయి మురుగు కాల్వలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీనికి తోడు దోమల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని సంప్రదిపస్తే పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎవ్వరికి చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.


పోల్యనాయక్ తండాలోని ఓ వీధిలో పారుతున్న మురుగు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


హాలియా : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


మిర్యాలగూడ అర్బన్ : సరస్వతి శిశు మందిర్‌లో..


నిడమనూరు : నాగార్జున హైస్కూల్‌లో..

హాలియా: పట్టణంలోని సృజనా జూనియర్ కళాశాలలో 1999 -2001 విద్యా సంవత్సరంలో సీఈసీ , హెచ్ఈసీ చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ధర్వేశిపురములో నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు. ఆనాటి మధురస్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనాటి సృజన జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కొల్లు జితేందర్ రెడ్డి, అధ్యాపకులు నాగిరెడ్డి, వెంకన్న, సైదిరెడ్డి, దానయ్య ,మల్లయ్య శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాసరావు, విద్యార్థులు తలారి పరమేష్, యాదగిరి, తెనాలి రవితేజ రెడ్డి, సతీష్ కుమార్ రెడ్డి, కూన్‌రెడ్డి రామ్‌రెడ్డి, ప్రభావతి, సుభాషిని, వజ్రమ్మ, స్రవంతి పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని సరస్వతినగర్‌లో శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 1997-98 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పరిచయ కార్యక్రమం నిర్వహించిన అనంతరం గురూజీ, మాతాజీలకు సన్మానం చేశారు. అనంతరం గత స్మృతులను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్‌బాబు, నాగేందర్, రిషికేశ్వర్ రావు, సోమ సుందర్, శ్రీనివాస్, మంజునాథ్, యోగిత, సునీత, నాగిని తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు : మండలకేంద్రంలోని నాగార్జున హైస్కూల్‌లో 2006-07 పదో తరగతి చదవిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను సత్కరించారు. విద్యార్థులు ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డారు...చిన్ననాటి జ్ఞాపకాలు, తమ విద్యాభ్యాస్యం ఎలా సాగిందో ఒకరినోకరు అడిగి తెలుసుకున్నారు. గురువులు కందగట్ల రఘు, బత్తుల సూరయ్య, సంతోష్, బాలాజీ, విజయ్‌లను పూర్వ విద్యార్థులు వెంకట్ , నారాయణ, సందీప్, సతీష్, శంకర్, భాస్కర్, పరిమళ, పాల్గొన్నారు.

ఉగ్ర దాడిలో మృతులకు నివాళి

నల్లగొండ: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారికి రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని ఎన్జీ కాలేజీ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గోలి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎం.డేవిడ్, ఎల్లేశం, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ హాసన్ అలీ, కోశాధికారి భూపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్, పి.శంకరయ్య, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సకిలం శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు, శంకరయ్య, బి.కృష్ణయ్య, బి సైదులు, విష్ణువర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

పింఛన్ల పంపిణీలో జాప్యం

- అధికారుల నిర్లక్ష్యంతో ఆలస్యంగా అందజేత
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు


నిడమనూరులోని పోస్టాఫీస్

నిడమనూరు : ఆసరా పింఛన్లు సకాలంలో అందకపోవడంతో మండలంలోని లబ్ధిదారులు నిరాశ, నిస్పృహ వ్యక్తం చేస్తున్నారు. నెలాఖారు వచ్చిందంటే పింఛన్ కోసం లబ్ధిదారులు పోస్టల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. నెల చివరి వారంలో ఇస్తున్నా అది సకాలంలో అందడం లేదు. ఆసరా పింఛన్ పంపిణీలో పోస్టల్, ట్రెజరీ అధికారులు జాప్యంతో ప్రతి నెలా ఆలస్యమవుతోంది. పింఛన్ పంపిణీ ఆలస్యంపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే సాంకేతిక కారణాలు సాకుగా చూపుతున్నారు. నిడమనూరు సబ్-పోస్టాఫీసుకు మిర్యాలగూడ హెడ్ పోస్టాఫీసుకు నిధులు వస్తే అక్కడి నుంచి బ్యాంకు అకౌంట్లోకి అనంతరం నగదు డ్రా చేసుకొని రావాల్సి ఉంటుందని, దీంతో రెండు, మూడు రోజులు ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ వచ్చినా ప్రస్తుతం పింఛన్ల జాప్యంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు అలా ఉంటే పోస్టల్ సిబ్బంది కూడా పింఛన్‌దారులతో అగౌరవంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పింఛన్ చిల్లర విషయంలో సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇష్టారీతిగా ఇస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నిస్తే పింఛన్ ఆలస్యం చేస్తున్నారు. ఫింగర్ ప్రింట్ పడడం లేదని జాప్యం చేస్తూ మరోసారి లైన్‌లో రావాలని పింఛన్‌దారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలాఖరున అందాల్సిన పింఛన్ నిడమనూరు మండలంలో వారం ఆలస్యంగా అందుతుండడంతో పలువురు పింఛన్‌దారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోస్టల్ ఉన్నతాధికారులు వెంటనే నిధులు విడుదలయ్యేలా కృషిచేస్తే సకాలంలో పింఛన్ అందే అవకాశం ఉంటుంది.

సాంకేతిక సమస్యలతో జాప్యం

నిధులు ఆలస్యంగా విడుదల చేస్తున్నారు. మిర్యాలగూడ పోస్టల్ కార్యలయం నుంచి అంత పెద్ద మొత్తం తీసుకురావడంతో ఇబ్బంది ఉంటుంది. అంతేగాక కొన్ని సార్లు సాంకేతిక సమస్యలతో జాప్యం జరుగుతుంది

– మహేశ్, పోస్ట్‌మాస్టర్

రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు


రోడ్డును ఆక్రమించి నిర్మించిన మెట్లు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని స్థానిక సాగర్ రోడ్డులో గల జేబి కాలనీలో నూతన గృహ నిర్మాణాలు చేపట్టే వారు రోడ్లను ఆక్రమిస్తూ మెట్లు నిర్మించుకుంటున్నారు. తమ స్థలం ఉన్నంత వరకు నిర్మించుకోకుండా రోడ్లను ఆక్రమించుకొని ఇంటి ముందు భాగం వద్ద మెట్లను నిర్మిస్తున్నారు. ఈ విషయానికి సంబంధించి కొంత మంది గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇలా అనుమతులు లేకుండా రోడ్లను ఆక్రమించుకొని నిర్మించిన మెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రతజోత్సవ సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు


హాలియా : అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్


మిర్యాలగూడ : బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు , తదితర నాయకులు

సాక్షి,నెట్‌వర్క్ : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈసందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఆపార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే అడవిదేవులపల్లి, మాడుగుపల్లి మండలాల్లో బీఆర్ఎస్25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ జెండాలను ఆ గ్రామాల్లో గులాబీ జెండాలను ఆవిష్కరించి అనంతరం వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు తరలివెళ్లారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో హాలియా పట్టణ కేంద్రంలో సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ వరంగల్ సభకు తరలివెళ్లారు. అంతకముందు ఆ పార్టీ జెండాను వారు ఆవిష్కరించారు. అలాగే నిడమనూరు, పెద్దవూర, తిరమలగిరి(నాగార్జునసాగర్) మండల కేంద్రాల నుంచి ఆ సభకు తరలివెళ్లారు. అలాగే పార్టీ జెండాలను ఆవిష్కరించారు. దేవరకొండ నియోజకవర్గంలో చందంపేట, కొండమల్లేపల్లి, డిండి మండలాలనుంచి కూడా తరలివెళ్లారు.

క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి నూతన కమిటీ ఏర్పాటు చేయనున్నందున ఆసక్తి గల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ మృత్యుంజయశాస్త్రి ఆదివారం తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనల మేరకు అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయశాఖ నల్లగొండ పేరుతో 20రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అక్కడ పరిశీలన అనంతరం వారు డిప్యూటీ కమిషనర్ దేవాదాయశాఖ, బొగ్గులకుంట, తార్నాకా చిరునామాకు పంపిస్తారని, దరఖాస్తుల పరిశీలన అనంతరం ఆలయానికి నూతన కమిటీని నియమిస్తామన్నారు.

4న అభివృద్ధి, సంక్షేమ సంబరాలు


సంబరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ, పథకాలపై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మే 4న మిర్యాలగూడలోని ఎన్ఎస్పీ క్యాంపులో అభివృద్ధి సంబురాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా అభివృద్ధి సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రముఖ గాయని మంగ్లీ, ఇతర ఆర్టిస్టుల ఆధ్వర్యంలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాదిల శ్రీనివాస్, మోయిజ్, దేశిడి శేఖర్‌రెడ్డి, జావిద్, జాని, రవినాయక్, అజహర్, పర్వేజ్, ఆలగడప గిరిధర్, ఉబ్బపల్లి కాశయ్య, పాతూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి


మాట్లాడుతున్న బంటు సైదులు

మిర్యాలగూడ టౌన్ : బీజేపీని బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నేత బంటు సైదులు, పార్టీ ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శాంతినగర్‌లో టూ టౌన్ ఆ పార్టీ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ టూ టౌన్ పరిధిలో 24 వార్డులున్నందున రాబోయో ఎన్నికల వరకు కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మోసపూరిత వాగ్దానాలను చేస్తున్నందున ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని నమ్మేపరిస్థితిలో ప్రజలు లేరన్నారు. బీజేపీ టూ టౌన్ అధ్యక్షుడు పెద్దబోయిన వెంకటరమణ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు ఐల శ్రీను, లక్ష్మారెడ్డి, మహేశ్, వేణు, కొండేటి శేఖర్, మణిలాల్ తదితరులున్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: పట్టణంలోని అన్ని వార్డుల శాఖ మహాసభలు, మండల మహాసభలు నిర్వహించుకుని ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్దంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పానగల్ ఉదయ సముద్రం సామర్థ్యం పెంచాలని భవిష్యత్‌లో తాగునీటి కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. యువ వికాసం దరఖాస్తుదారులందరికీ రుణం ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికి అందజేయాలన్నారు. మేడే వాడవాడలా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ముండ్ల ముత్యాలు, ఎస్.కె.మదార్, వి.లెనిన్, గాదెపాక రమేష్, పాండరి, శివరాత్రి వీరయ్య, సుజాత, మొండికత్తి కౌసల్యనాయక్, విజయ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న సత్తయ్య

నల్లగొండ టౌన్: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మిక సంఘాలు మే 20 చేపట్టనున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కందుల నరసింహ, యం.చంద్రమౌళి, కె.శ్యాంసుందర్, యం నర్సింహయ్య, సీహెచ్ రేవతి తదితరులు పాల్గొన్నారు.